క్లుప్తంగా

చంద్రశేఖరస్వామికి విశేష పూజలు


ప్రత్యేక అలంకరణలో చంద్రశేఖరస్వామి

రంగంపేట: మండలంలోని చంద్రేడు గ్రామంలో కొలువైయున్న కాత్యాయనీ సమేత చంద్రశేఖర స్వామివారికి ఆలయ అర్చకుడు మైలవరపు కృష్ణశర్మ సోమవారం విశేష పూజలు నిర్వహించారు. తెల్లవారుజామునే స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి స్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

నేడు మండల పరిషత్ సాధారణ సమావేశం

రంగంపేట: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఉదయం 10 గంటలకు మండల ప్రజా పరిషత్ సాధారణ సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ పి.వెంకటరత్నం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ రిమ్మలపూడి శ్రీదేవి అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబు, జిల్లా పరిషత్ కో–ఆప్షన్ సభ్యుడు లంక చంద్రన్న తదితరులు హాజరవుతారన్నారు. కావున మండల స్థాయి అధికారులందరూ తమ శాఖల ప్రగతి వివరాలతో సమావేశానికి తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

రంగాపురం పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడి మృతి


సుబ్రహ్మణ్యంరాజు (ఫైల్)

అమలాపురం రూరల్: మండలంలోని రంగాపురం పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు భూపతిరాజు సుబ్రహ్మణ్యంరాజు(70) సోమవారం మృతి చెందారు. గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన కాకినాడలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. మృతుడు సుబ్రహ్మణ్యంరాజుకు భార్య, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆయన మృతిపై పలువురు సంతాపం తెలియజేశారు.

స్టూడెంట్ కిట్ల పంపిణీ


స్టూడెంట్ కిట్లతో బొబ్బిల్లంక హైస్కూల్ విద్యార్థులు

సీతానగరం: బొబ్బిల్లంక జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులకు సోమవారం స్టూడెంట్ కిట్లను పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయుడు కోలా సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పెండ్యాల అసిన్‌బాబు, పోలిన కృష్ణ తదితరులు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం అందజేస్తున్న సదుపాయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కాచి చల్లార్చిన నీటినే తాగాలి


మాట్లాడుతున్న జిల్లా ఇమ్యూనైజేషన్ ఆఫీసర్ రాజకుమారి

సీతానగరం: ప్రతి ఒక్కరూ కాచి చల్లార్చిన నీటిని తాగాలని జిల్లా ఇమ్యూనైజేషన్ ఆఫీసర్ డాక్టర్ రాజకుమారి సూచించారు. సీతానగరం పంచాయతీ పరిధిలోని లంకూరు అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం స్టాప్ డయేరియా కాంపెయిన్ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గర్భిణులు రక్తహీనత రాకుండా పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. రక్తహీనత వల్ల ప్రసవ సమయంలో కలిగే నష్టాలను వివరించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ డాక్టర్ ఏవీకే చైతన్య, హెచ్‌పీ లక్ష్మి, దైవకృప, ఏఎన్ఎంలు మున్నీషా బేగం, సలీమా బీ, శాంతి, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ట్యాంకర్ల ద్వారా ప్రజలకు నీటి సరఫరా


సీతానగరం లంకూరులో ట్యాంకర్ వద్ద నీరు పట్టుకుంటున్న ప్రజలు

సీతానగరం: గ్రామంలో డయేరియా నమోదైన ప్రాంతంలో పంచాయతీ అధికారులు ట్యాంకర్ ద్వారా నీటిని ప్రజలకు అందజేస్తున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ కోండ్రపు ముత్యాలు మాట్లాడుతూ డయేరియా ప్రాంత ప్రజలకు నాలుగు ట్యాంకర్ల ద్వారా నీటిని అందిస్తున్నామన్నారు. పంచాయతీ వాటర్ ట్యాంక్‌లను శుభ్రపర్చడం జరిగినా కొన్ని రోజుల పాటు ట్యాంకర్ల ద్వారా నీటిని అందిస్తామన్నారు. గ్రామంలో డ్రైనేజీ పూడికతీత పనులు చేశామని, బ్లీచింగ్ వెదజల్లుతున్నామన్నారు. వాటర్ ట్యాంక్‌లలో నీటిని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు టెస్టుకు పంపించగా, సక్రమంగా ఉన్నట్లు రిపోర్టులు వచ్చాయన్నారు.

వైఎస్సార్ అడుగుజాడల్లో నడుద్దాం

- మాజీ ఎమ్మెల్యేలు జక్కంపూడి రాజా, డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- వాడవాడలా మహానేత జయంతి


వైఎస్సార్ జయంతిని పురస్కరించుకుని పెదపూడిలో కేక్ కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి


కోరుకొండలో వైఎస్సార్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, అనంత ఉదయ్ భాస్కర్ తదితరులు


కొంకుదురులో వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు


రంగంపేటలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి


అనపర్తిలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేస్తున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

పెదపూడి: తన అసమాన పాలనతో ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసిన మహానేత, దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అడుగుజాడల్లో ప్రతిఒక్కరూ నడవాలని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 75వ జయంతిని వైఎస్సార్ సీపీ నేతలు, పార్టీ కార్యకర్తలు, వైఎస్సార్ అభిమానులు సోమవారం అనపర్తి నియోజకవర్గంలోని వాడవాడలా ఘనంగా నిర్వహించారు. పెదపూడి గ్రామంలో మాజీ ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణరెడ్డి వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కేక్ కట్ చేసి అందరికీ స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పాలన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు స్వర్ణయుగమన్నారు. సంక్షేమ రథ సారథిగా ప్రజల ఆత్మ బంధువుగా కొలువై ఉన్నారన్నారు. వైఎస్సార్ చనిపోయి 15 ఏళ్లు అవుతున్నా ఇంకా మన మధ్యే ఆయన సజీవంగానే ఉన్నట్లుగా అనిపిస్తుందన్నారు. వైఎస్సార్ అందించిన పాలన ప్రతి కుటుంబంలో సంతోషాలు నింపిందన్నారు. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ, 108, 104, ఫీజు రీయింబర్స్‌మెంట్ తదితర సంక్షేమ పథకాలు అమలు చేసి ఎందరికో ప్రాణాలు పోసిన గొప్ప ప్రజానేత వైఎస్సార్ అని కొనియాడారు. అలాంటి నేత ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కేతా తులసి, జెడ్పీటీసీ సభ్యురాలు పేపకాయల వెంకటలక్ష్మి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అద్దంకి ముక్తేశ్వరరావు, సర్పంచుల సమాఖ్య నియోజకవర్గ సమాఖ్య అధ్యక్షుడు కొటికలపూడి చినబాబు, రాష్ట్ర చేనేత విభాగం కార్యదర్శి పప్పు సింహాచలం, ఎంపీటీసీ సభ్యుడు సమ్మంగి దుర్గా ప్రసాద్, పార్టీ మండల కన్వీనర్ గుత్తుల రమణ, పీఏసీఎస్ మాజీ చైర్మన్ మార్ని కామరాజు చౌదరి, మండల సర్పంచుల సమాఖ్య అధ్యక్షుడు కోసూరి వాసు, కాకర సాయిబాబు, మీసాల నాగరాజు, మార్ని పెద్దబ్బు తదితరులు పాల్గొన్నారు. కరకుదురులో సర్పంచి వుండ్రు చంద్రకళ, వైస్ ఎంపీపీ కర్రెడ్ల వెంకన్నబాబు, వాసంశెట్టి మాధవ, జి.మామిడాడలో సర్పంచి లంక మున్ని, ఉప సర్పంచి మేడపాటి తాతారెడ్డి తదితరులు వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పెదపూడి: అనపర్తిలో వైఎస్సార్ 75వ జయంతిని సందర్భంగా స్థానిక కెనాల్ రోడ్డులో ఉన్న దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్సార్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు సత్తి గీతా వరలక్ష్మి, అనపర్తి ఏఎంసీ మాజీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, నల్లమిల్లి మురళీ బాలకృష్ణారెడ్డి, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు కుక్కల సురేష్, ఎంపీటీసీ సభ్యుడు కొండేటి భీమేష్, తుమ్మరాజేశ్వరి, కోటేశ్వరరావు, రాము, డేవిడ్, రమణ, రాధావెంకటరెడ్డి, నూతిక లక్ష్మి, వాసంశెట్టి వెంటర్రావు, జమ్మి, సత్తి గంగిరెడ్డి, శంకర్‌బాబు, బుల్లిరెడ్డి, పడాల సత్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రంగంపేట: దివంగత మహానేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతిని పురస్కరించుకుని మండల కేంద్రమైన రంగంపేటలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ జయంతి రోజున రైతు దినోత్సవం జరుపుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబు, జెడ్పీకో–ఆప్షన్ సభ్యుడు లంక చంద్రన్న, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కొల్లాటి ఇజ్రాయిల్, రాష్ట్ర చేనేత విభాగం కార్యదర్శి పాలాటి నాగేశ్వరరావు, అడబాల వెంకటేశ్వరరావు, సొసైటీ చైర్మన్ పోతుల బులివీర్రాజు పాల్గొన్నారు. సుభద్రంపేటలో జెడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబు వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సర్పంచ్ కూటి సాయి తాతారావు, గ్రామ కన్వీనర్ మలిరెడ్డి బలరాంమ్మూర్తి, గుద్దటి గంగాధరం పాల్గొన్నారు.

బిక్కవోలు: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సంక్షేమ రథ సారథి అని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. వైఎస్సార్ జయంతిని పురస్కరించుకుని బిక్కవోలులో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోతుల ప్రసాద్‌రెడ్డి, గువ్వల సత్తిరెడ్డి, తమ్మిరెడ్డి నాగశ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు. పందలపాకలో వైఎస్సార్ సీపీ గ్రామ శాఖ అధ్యక్షుడు సత్తి హరిప్రసాద్‌రెడ్డి, మండల జేసీఎస్ కన్వీనర్ బొడ్డు ముత్యాలరావు, సొసైటీ మాజీ డైరెక్టర్ పడాల వీర్రాఘవరెడ్డి, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు కిలపర్తి సత్యనారాయణ తదితరులు వైఎస్సార్‌కు ఘన నివాళులర్పించారు. కొంకుదురులో సర్పంచ్ సత్తి వీరమణి, ఎంపీటీసీ కొంకుదురు పీవీల ఆధ్వర్యంలో వైఎస్సార్ జయంతి వేడుకలు నిర్వహించారు.

రైతును రాజును చేసిన వైఎస్సార్


కోరుకొండలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న నాయకులు


రాజానగరంలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

మధురపూడి: రాష్ట్రంలో రైతును రాజును చేసిన మహనీయుడు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి అని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. కోరుకొండలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సోమవారం వైఎస్సార్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి ఎమ్మెల్సీ అనంత ఉదయ్ భాస్కర్‌తో కలిసి జక్కంపూడి రాజా పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ శ్రేణుల సమక్షంలో కేక్ కట్ చేసి అందరికీ పంచారు. రాజా మాట్లాడుతూ ఉచిత విద్యుత్ పథకం ద్వారా మెట్ట రైతులకు, పావలా వడ్డీకే రుణాల ద్వారా మహిళలకు, ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం ద్వారా పేద విద్యార్థులకు మరువలేని సహకారాన్ని వైఎస్సార్ అందించారన్నారు. 108, ఆరోగ్యశ్రీ పథకాలతో మరెందరికో ప్రాణాలు పోస్తున్నారన్నారు. ఆయన తనయుడు జగన్ మోహన్‌రెడ్డి తండ్రి బాటలోనే పయనిస్తూ మరెన్నో బృహత్తర పథకాలను అమలు చేసి, ప్రజా సంక్షేమానికి అధిక ప్రాధాన్యతనిచ్చారని గుర్తు చేశారు.


సీతానగరం మదర్‌థెరిస్సా సెంటర్‌లో కేక్ కట్ చేస్తున్న పార్టీ నాయకులు


సీతానగరం పీహెచ్‌సీలో రోగులకు పండ్లు, బ్రెడ్లు అందిస్తున్న ఎంపీపీ జ్యోత్స్న

రక్తదాన శిబిరం

వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి సందర్భంగా కోరుకొండలో జక్కంపూడి రామ్మోహనరావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శిబిరంలో జక్కంపూడి రాజా రక్తదానం చేశారు. డాక్టర్ జక్కంపూడి రాజశ్రీ పర్యవేక్షణలో జరిగిన ఈ శిబిరంలో ఎమ్మెల్సీ అనంత ఉదయ్ భాస్కర్, సీతానగరం, కోరుకొండ, రాజానగరం మండలాలకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వాడవాడలా..

మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతిని కోరుకొండ మండలంలో వాడవాడలా ఘనంగా నిర్వహించారు. దోసకాయలపల్లిలో జెడ్పీటీసీ కర్రి నాగేశ్వరరావు, ఎంపీటీసీలు గొల్లపల్లి ప్రవీణ్ ఆధ్వర్యంలో, కోరుకొండలో పార్టీ మండల కన్వీనర్ గణేశుల పోసయ్య, మార్కెట్ యార్డు కమిటీ మాజీ చైర్మన్ నక్కా రాంబాబు, మాజీ వ్యవసాయ సలహా మండలి జిల్లా సభ్యుడు కంటే వినయ్ తేజ ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరిగాయి. మండల వ్యాప్తంగా జరిగిన కార్యక్రమాలలో ఆయా సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా..

రాజానగరం: నియోజకవర్గ కేంద్రమైన రాజానగరంలోని వైఎస్సార్ జంక్షన్‌లో ఉన్న దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దూలం పెద్ద ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. తూర్పుగానుగూడెం ఎస్సీ కాలనీలోని వైఎస్సార్ విగ్రహానికి చల్లా వెంకట్ ఆధ్వర్యంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు పూలమాల వేసి అంజలి ఘటించారు. నరేంద్రపురం, నందరాడ, రాధేయపాలెం, ముక్కినాడ, పుణ్యక్షేత్రం, శ్రీకృష్ణపట్నం గ్రామాలలో పార్టీ శ్రేణుల ఆధ్వర్యంలో వేడుకలు జరిపారు.

ప్రజల గుండెల్లో కొలువైన దేవుడు

సీతానగరం: ప్రజల గుండెల్లో కొలువైన దేవుడు వైఎస్సార్ అని సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు పెదపాటి డాక్టర్‌బాబు, మండల కన్వీనర్ ఘంటా శ్రీనివాస్ అన్నారు. సీతానగరం మదర్‌థెరిస్సా సెంటర్‌లోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సర్పంచ్ కోండ్రపు ముత్యాలు, మాజీ ఆర్బీకె చైర్మన్ వలవల వెంకట్రాజు, ఉప సర్పంచ్ ద్వారంపూడి రామకృష్ణ, యూత్ అధ్యక్షుడు కోలా శ్రీను, వలవల సత్తిబాబు పాల్గొన్నారు. చినకొండేపూడిలోని హైస్కూల్ వద్ద గల వైఎస్సార్, జక్కంపూడి రామ్మోహనరావుల విగ్రహాలకు సర్పంచ్ చెరుకూరి శ్రీనివాస్, ఉప సర్పంచ్ సత్తిపండు రాజు, పార్టీ నాయకులు ముదునూరి రామకృష్ణరాజు, పోలినాటి ఈశ్వరుడు, యర్రంశెట్టి బాబులు నివాళులర్పించారు. ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న ఆధ్వర్యంలో సీతానగరం పీహెచ్‌సీలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. చీపురుపల్లిలో గోపిశెట్టి అచ్చారావు, మన్నెల్లి వెంకట్రావు ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి.

కూటమి నాయకుల దౌర్జన్యాలు సహించం

మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి


పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ శోభన్‌కుమార్‌తో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

పెదపూడి: ఎన్నికల ఫలితాల అనంతరం నియోజకవర్గంలో ఎన్డీఏ కూటమి నాయకులు చేస్తున్న దౌర్జన్యాలు సహించబోమని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. ఇటీవల పెదపూడి గ్రామంలో ఎన్డీఏ కూటమి నాయకులు అన్యాయంగా జేసీబీతో కూల్చివేసిన టేకుమూడి త్రిమూర్తులుకు చెందిన ఇంటిని సోమవారం ఆయన పరిశీలించారు. అనంతరం బాధితులు, పార్టీ నాయకులతో కలిసి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి అక్కడ ఎస్ఐ శోభన్‌కుమార్‌తో మాట్లాడారు. ఘటన జరిగి మూడు రోజులు అవుతున్నా ఇంతవరకూ ఇల్లు కూల్చినవారిని ఎందుకు అరెస్ట్ చేయలేందంటూ ప్రశ్నించారు. తక్షణం దర్యాప్తు చేపట్టి బాధితుల ఫిర్యాదు మేరకు దౌర్జన్యానికి పాల్పడిన వారిపై కేసు నమోదు చేయాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేవలం వైఎస్సార్ సీపీకి ఓటు వేశారనే నెపంతో నిరుపేద ఇల్లు కూల్చడం కూటమి పాలనలో జరుగుతున్న దారుణాలకు నిదర్శనమన్నారు. ప్రజలు ఎన్డీఏ కూటమికి అధికారం ఇచ్చింది దౌర్జన్యాలు చేయడానికి కాదన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కేతా తులసి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి అద్దంకి ముక్తేశ్వరరావు, మండల అధ్యక్షుడు గుత్తుల వెంకటరమణ, ఎంపీటీసీ సభ్యులు పేపకాయల వెంకటరమణ, సమ్మంగి దుర్గా ప్రసాద్, సర్పంచుల సమాఖ్య అధ్యక్షుడు కోసూరి వాసు, మార్ని కామరాజు చౌదరి, మార్ని పెద్ద అబ్బు, కాకర సాయిబాబు పాల్గొన్నారు.

బలహీన వర్గాలే లక్ష్యంగా కూల్చివేతలు

బిక్కవోలు: బడుగు బలహీన వర్గాలే లక్ష్యంగా కూటమి నాయకులు కూల్చివేతలు, దోపిడీలకు పాల్పడి ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని పందలపాక గ్రామంలో ఆదివారం కూల్చి వేసిన గండి నాగ వెంకట రమణ పశువులు షెడ్డు, గోరపల్లి సీతారామయ్యలకు చెందిన రేకుల షెడ్డును ఆయన పరిశీలించారు. బాధితురాలు రామలక్ష్మి తన షెడ్డును రెండు జేసీబీలతో నిమిషాల్లో నేల మట్టం చేశారని బోరున విలపించింది. మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి బాధితులను ఓదార్చారు. అవసరమైతే న్యాయస్థానాలను ఆశ్రయించి న్యాయం జరిగేలా చూస్తానని బాధితులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గ్రామ శాఖ అధ్యక్షుడు సత్తి హరిప్రసాద్ రెడ్డి, ఎంపీటీసీ మచ్చా పాప, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోతుల ప్రసాద్‌రెడ్డి, బొడ్డు ముత్యాలరావు, మాజీ జెడ్పీటీసీ కిలపర్తి సత్యనారాయణ పాల్గొన్నారు.

'నన్నయ'పై తప్పనిసరిగా విచారణ జరగాలి

- 2014 నుంచి 24 వరకూ ప్రతి అంశాన్ని పరిశీలించాలి
- మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా


విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీలో జరిగిన అవకతవకలపై తప్పనిసరిగా విచారణ జరిపించాలని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. యూనివర్సిటీలో గత ఐదేళ్లలో కాంట్రాక్టులు, నిర్మాణాలు, నియామకాలలో భారీగా అవినీతి జరిగిందని, సీబీసీఐడీతో విచారణ జరిపిస్తామని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ చేసిన ఆరోపణలపై జక్కంపూడి స్పందించారు. దమ్ముంటే 2014 నుంచి 2024 వరకు యూనివర్సిటీలో జరిగిన ప్రతి అంశం పై విచారణ జరిపించాలని సవాల్ చేశారు. లేకుంటే బత్తుల చేసిన ఆరోపణలు ఆర్భాటం కోసం చేసినట్టుగా ఉంటాయన్నారు. కోరుకొండలో సోమవారం దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతిలో పాల్గొన్న జక్కంపూడి రాజా.. అనంతరం మీడియాతో మాట్లాడారు. దివంగత నేతలు వైఎస్సార్, జక్కంపూడి రామ్మోహనరావుల ఆలోచనలతో ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఏర్పడిందన్నారు. ఆ తరువాత రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చే వరకు ఈ యూనివర్సిటీ అభివృద్ధి గురించి పట్టించుకున్న పాలకులు, నాయకులు లేరన్నారు. గడచిన ఐదేళ్లలో డిపార్టుమెంట్ల చుట్టూ తిరిగి యూనివర్సిటీ అభివృద్ధికి అవసరమైన నిధులను మంజూరు చేయించామని గుర్తు చేస్తూ, అందుకు సంబంధించిన ఫైళ్లు తన వద్ద ఉన్నాయన్నారు. నిధులు మంజూరులో జాప్యం జరిగితే యూనివర్సిటీలోని అంతర్గత నిధులను ఉపయోగించి, పనులు పూర్తి చేయించడానికి అనుమతులు కోరామన్నారు. ఈ విధంగానే యూనివర్సిటీలో పలు భవన నిర్మాణాలు జరిగాయని వివరించారు. అయితే సార్వత్రిక ఎన్నికలలో పడి చివరి ఆరు మాసాలు యూనివర్సిటీ ప్రగతిపై దృష్టి పెట్టలేకపోయమన్నారు.

20 వేల దొంగ ఓట్లు ఏమయ్యాయి

ఎన్నికల సమయంలో నియోజకవర్గంలో 20 వేల దొంగ ఓట్లు ఉన్నాయంటూ చేసిన ఆరోపణ ఏమైందని ప్రస్తుత ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణను మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ప్రశ్నించారు. 20 వేలు కాదుకదా కనీసం రెండు వేల దొంగ ఓట్లను కూడా అధికారులుగాని, ఎన్నికల సంఘంగాని ధ్రువీకరించలేదన్నారు. ఎటువంటి ఆధారాలు లేకుండా ఆరోపణలు చేసి, ఎదుటి వారిపై బురద చల్లి పబ్బం గడుపుకోవడం బత్తులకు అలవాటేనన్నారు.

ఉద్యోగాల పేరుతో వసూలు

వివిధ సంస్థలలో ఉద్యోగాలు వేయిస్తానంటూ నిరుద్యోగుల నుంచి లక్షల కొద్ది వసూలు చేసి, ఉద్యోగాలు అమ్ముకున్న వ్యక్తి, నేడు తనపై విమర్శలు చేయడం వింతగా ఉందని జక్కంపూడి రాజా అన్నారు. నేర చరిత్ర కలిగిన వ్యక్తి నేడు నీతులు మాట్లాడటం దెయ్యాలు వేదాలు వల్లించినట్టుగా ఉందన్నారు. కొత్తగా ఎన్నికైన ప్రభుత్వానికి, పాలకులకు ఏడాది పాటు సమయం ఇవ్వాలని ఓర్పుతో ఉన్నామన్నారు. లేనిపోని ఆరోపణలు చేస్తే తగిన సమాధానం చెబుతామని హెచ్చరించారు.

ఆరోగ్యాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దుతాం


అనపర్తిలో 100 పడకల ఆస్పత్రి భవనానికి భూమి పూజ చేస్తున్న మంత్రి సత్యకుమార్ యాదవ్

పెదపూడి: రాష్ట్రాన్ని ఆరోగ్యాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దుతామని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వై.సత్యకుమార్ యాదవ్ అన్నారు. అనపర్తిలో సీహెచ్‌సీ ఆస్పత్రిని 100 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేస్తూ రూ.13.85 కోట్లతో నిర్మించనున్న ఆస్పత్రి భవనం, అదనపు గదుల నిర్మాణానికి సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ ప్రజారోగ్యమే లక్ష్యంగా ఆస్పత్రుల్లో మౌలిక సదుపాయాలు కల్పించడానికి కృషి చేస్తామన్నారు. ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి మాట్లాడుతూ ప్రజారోగ్య సంరక్షణ లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి పనిచేస్తాయని చెప్పారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, వైద్యశాఖ రీజినల్ డైరెక్టర్ పి.పద్మ శశిధర్, మాజీ మంత్రి కేఎస్ జవహర్, ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, మర్రెడ్డి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

చినకొండేపూడిలో గ్రామసభ

సీతానగరం: చినకొండేపూడి పంచాయతీ ఆవరణలో సోమవారం జరిగిన గ్రామసభలో ప్రజలు వివిధ సమస్యలను తెలియజేశారు. సర్పంచ్ చెరుకూరి శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి సత్యదేవి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. వడ్లమూరి ఏసురాజు, కోసూరి రవి కుమార్ రాజు మాట్లాడుతూ డ్రైనేజీలలో పూడికతీతలు లేవని, కనీసం బ్లీచింగ్ కూడా జల్లడం లేదన్నారు. ఎస్సీపేటలో పంచాయతీ మంచినీటి కుళాయిల నుంచి వస్తున్న నీరు రంగుమారుతోందన్నారు. ఉప సర్పంచ్ చేకూరి సత్తిపండురాజు తదితరులు పాల్గొన్నారు.

127వ సారి రక్తదానం చేసిన డాక్టర్ బాబు


కోరుకొండలో రక్తదానం చేస్తున్న డాక్టర్ బాబు

సీతానగరం: గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు పెదపాటి రమేష్ బాబు (డాక్టర్‌బాబు) 127వ సారి రక్తదానం చేశారు. కోరుకొండ పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ఆధ్వర్యంలో సోమవారం వైఎస్సార్ జయంతి సందర్భంగా నిర్వహించిన శిబిరంలో డాక్టర్ బాబు 127వ సారి రక్తదానం చేశారు. 1998లో డాక్టర్ బాబు ఫ్రెండ్స్ సర్కిల్ – మదర్ థెరిస్సా సేవా సమితిని నెలకొల్పారు. దీనిలో వెయ్యిమంది సభ్యులు ఉన్నారు. ఇప్పటికి 24,800 మంది రోగులకు రక్తదానం చేశారు. ఆయన 2008, 2009, 2010, 2019, 2024 లలో జిల్లా కలెక్టర్ల చేతుల మీదుగా అవార్డులందుకున్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు


సమావేశంలో పాల్గొన్న స్పెషల్ ఆఫీసర్ సాయిబాబా తదితరులు

సీతానగరం: మండలంలో అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్ పి.సాయిబాబా అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం మండల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఏఎన్ఎంలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సాయిబాబా మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్యంపై దృష్టి సారించాలని, డ్రైనేజీ వ్యవస్థపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, సురక్షిత తాగునీటిని అందించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గర్భిణులు, శిశువులకు సమయానికి టీకాలు వేయాలని, పౌష్టికాహారం తీసుకునేలా చూడాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో కృష్ణ చైతన్య, పీహెచ్‌సీ డాక్టర్ ఏవీకే చైతన్య, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ రవికుమార్, ఈవోపీఆర్డీ మూర్తి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వి.అవినాష్ పాల్గొన్నారు.